విశ్వాస ఘాతుకులు

పొయ్యిమీది అన్నం మెత్తనయిపోతుందేమోనన్న భయంతో చంటిపిల్లను మంచంమీదవేసి పొయ్యి దగ్గరికి పోయింది సరోజిని. చంటిపిల్ల మరింత గోలచేస్తూ అప్పుడప్పుడు దీర్ఘంగా గుక్కపడుతూ యేడుస్తూంది. అన్నం వార్చేసంత వరకు పిల్లను తియ్యటానికి వీలుచిక్కందికాదు. అప్పుడు సరోజినికి చాల విసుగనిపించింది. ఒకప్రక్క చంటిపిల్లతో వేగడం కష్టంగావుంటే మరోవేపు నలుగురు మనుష్యులకు వంటకావాలి. ఇది దినచర్యలలో ఓ పెద్ద సమస్యగా తయారయింది.

ఉదయం యేడుగంటలకు ఆఫీసుకుపోయిన జోగారావు పదకొండుగంటలకు ఇల్లుజేరుకున్నాడు. ఎప్పుడూ అదే సమయానికి రావటం అలవాటు. భోజనంచేసినవెంటనే కొంత సేపు విశ్రాంతి తీసుకుని పన్నెండు గంటలకు తిరిగి పోయేవాడు. రావటంతోనే అడిగాడు—

"పిల్ళింకా రాలేదూ?" మేజోళ్ళు విప్పుతూ. "లేదు.." ముక్తసరిగా జవాబు చెప్పింది సరోజిని. ఆ జవాబులో విసుగును గుర్తించగలిగాడు జోగారావు. మరింకేమనలేదు—సరోజినికోపం ఇంకా తగ్గలేదు. మనసులోని అక్కసును బయటికి వెళ్ళగక్కకుండా వుండలేకపోయింది.

"నే నింక యీ యింట్లో వుండలేనండీ—ఇటు చంటిపిల్ల గోలచేస్తూనే ఉంటుంది, ఒక్క ఘడియకూడా చంక దిగదు. ఎప్పుడూ ఎత్తుకుంటేనే వూరుకుంటుంది. లేకపోతే రణ

ఖేరిలా ఒకటే ఏడుపు...ఈ పిల్లను పెట్టుకుని నే నెలా వంట చేసేది!''.అంది కోపంగా.

సరోజినికి విసుగుపుట్టినప్పుడల్లా యీ ధోరణిలో మాట్లాడ్డం పరిపాటేనని జోగారావుకు తెలుసు. నిజమే! తనకుమాత్రం తెలియదూ? చంటిపిల్లని సంబాళించుకోటం కష్టమని—పోనీ ఒక వంటమనిషిని పెట్టుకుందుకైనా తనకు దొరికిన జీతం ఎంతని? అందులోనే నలుగురువ్యక్తులు, ఓ చంటిపాప జీవించాలి—పరధ్యాన్నంగా ఇవన్నీ ఆలోచించుకుంటున్నాడు జోగారావు. భర్త యింకా యేం జవాబు చెప్పకుండానే మళ్ళీ మొదలుపెట్టింది సరోజిని.

"తెలీకడుగుతాను-మనం తెచ్చుకొనేది మనకే చాలకుండావుంటే వీళ్ళిద్దరెందుకింకా? వాళ్ళకుకూడా అడుగులకు మడుగులొత్తుతూ తిరుగవలసిన ఖర్మ పట్టుకుంది నాకు. నాకెందుకండీ యీ తగలాటం? హాయిగా మనం బ్రతక్కుండా..." అంది విసురుగా.

జోగారావు మాత్రం యేమంటాడు? భార్యను క్రమంగా మంచి మాటలతో మార్గానికి తీసుకురావాలనుకున్నాడు.

"అలాగంటే యెలా సరోజినీ! వాళ్ళు మాత్రం యింకెక్కడికి పోతారు? తల్లీ—తండ్రీ! అంతా నేనేగా. తండ్రి తరువాత తండ్రిలాంటివా డన్నయ్య అన్నారు పెద్దలు..." యింకేమో చెప్పబోతూ వుంటే అర్ధోక్తిలోనే అందుకుంది సరోజిని.

"ఏం? మీ దగ్గర యెల్లకాలం కూర్చుని తెగతినటానికి బాండు వ్రాయించుకున్నారా? మీ అన్నయ్య కూడా యీ

వూళ్ళోనే వున్నారు కదూ! అక్కడ కొన్నాళ్లు వుండమని చెప్పకూడదూ!"

"నువ్వు చెప్పింది సబబుగానేవుంది సరూ! కాని యేం చేయను? మా అన్నయ్య సంగతి నీకు తెలీదు. పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ. ఒక్కఘడియ యెవరినీ యింట్లో వుండనీయదావిడ. నేనూ వాళ్ళలా పొమ్మంటే, యీ విశాల ప్రపంచంలో వాళ్ళకి తావేదీ? నిజంగా వాళ్ళను చూస్తుంటే నా కొక్కొక్కసారి జాలివేస్తుంది కూడా. సరియైన చదువా చెప్పించలేకపోయాను-వుద్యోగమా లేదు. ఎందుకూ పనికిరాని వాళ్ళల్లా తయారయ్యా రిద్దరు—" హృదయంలో యిమిడి వున్న బాధనంతా మాటల్లోనే చెప్పాడు జోగారావు.

"ఇప్పుడేదో వుద్యోగం చేస్తున్నారుగా...!" అంది జవాబుకై యెదురుచూస్తూ.

"ఆ! చేస్తున్నారు. వూరికే కూర్చోట మెందుకని నాకు తెలిసిన షాపుల్లో వుద్యోగాలు వేయించాను. నెలకు చెరో యిరవైరూపాయలు ముట్టుతాయ్"

"అంతమట్టుకు తెచ్చుకుంటున్నారన్నమాట! అయితే అది కూడా ఖర్చుపెట్టేస్తున్నారా!" ఆశ్చర్యం ప్రదర్శిస్తూ అడిగింది,

"ఏదీ! వాళ్ళసలు నలభై రూపాయ లెక్కడిస్తున్నారు? ఓ నెల యిద్దరూకలిపి పదిహేనిస్తే మరోనెల పదిస్తారు. నోరు విడిచి నే నెలాఅడిగేది? అథవా అడిగానా యేదో ఒక సాకు చెప్తుంటారు. తోబుట్టువైయుండి భోజనానికని యెలా డబ్బడుగుతాను!"

''బావుంది మీ వరస—యిన్నాళ్ళూ పెంచి పెద్దవాళ్ళనుగాచేశారు. వారు దమ్మిడీఅయినా గడించని రోజుల్లో మీరడిగారా? అడిగినా వాళ్ళిచ్చేవారా? వాళ్ళు యిప్పుడు గడిస్తున్నారుకాబట్టి, ఆ డబ్బులంతా తెచ్చి మీ చేతుల్లో పెట్టే బాధ్యత వాళ్ళది- అలా వారివ్వనప్పుడు అడిగిపుచ్చుకునే అధికారం మీకుంది. పరాయివాళ్ళు కాదుగా! తోబుట్టువులు మళ్ళీ-ఆ మాత్రం అభిమానం లేదూ మీరంటే?''

''అభిమానం యెందుకులేదూ! కావలసినంతవుంది. నేనంటే యెంతో నమ్రతగా, భయంతో తిరుగుతారు; చూస్తున్నావుగా.''

''మీరలా అనుకుంటున్నారు. అది మీ వూహమాత్రమే! మీ రింట్లో లేనప్పుడు వాళ్ళచర్యలు చూస్తే యింట్లో నుండి వెళ్ళగొట్టాలని బుద్ధిపుడుతుంది'' అంది సరోజినికోపంగా

జోగారావుకిప్పుడు చిక్కు-ప్రశ్న యెదురయింది. తను యింట్లో వున్నప్పుడు మూతులు మూసుకుని మారుమాటాడకుండా కూర్చునే తమ్ముళ్ళచర్యలు, సరోజినికంత కష్టంగావున్నాయంటే సమస్యకాదూ మరి—ఏం జవాబు చెప్పలేక చేతులు నులుముకుంటూ కూర్చున్నాడు జోగారావు.

వేణు, హరి అప్పుడే వచ్చారు వేణు పెద్దవాడు—హరి చిన్నవాడు. వేణుకు కాస్త ప్రపంచజ్ఞానం వుండటంవల్ల మానవ సంఘంలోని బాధలు అర్థంచేసుకోగలుగుతున్నాడు. కాస్త అణకువతో అందరిదగ్గర ప్రవర్తిస్తుంటాడు. కాని హరి ప్రవర్తన అతనికి వ్యతిరేకం. చిన్నా, పెద్దా లేకుండా నోటికొచ్చినట్లల్లా కుయ్యటం, తను మహా విద్యావంతుడల్లే.

యింగ్లీషు ముక్కలు రానివికూడా తప్పులతో కుయ్యడం— ఒక్కమాటలో చెప్పాలంటే తనకుతనే గొప్పగా భావించుకుంటాడు; ఇద్దరూ ద్వారంవరకూ పకపక నవ్వుతూ లోపలికి ప్రవేశించారు. ఎదురుగా అన్నయ్య జోగారావు కనిపించటంతో నవ్వు ఆగిపోయింది. ACC NO. 9498

జోగారావు యీ సంఘటన ప్రత్యక్షంగా చూచాడు. భార్య మాటల్లోని నిజం అర్థంచేసుకోగలిగాడు. గాని తనూ ఆమెతోపాటు వాళ్ళను తిరస్కరించి, నిరసన చూపితే వారికి తావెక్కడుంది? అన్నవూహ అతన్ని కలవరపరిచింది.

అన్నదమ్ములు ముగ్గురూ వరుసగా కూర్చుని తింటున్నారు. హరి కొంత అన్నం తినేసి వదినవేపు తిరిగి, "మజ్జిగవుంటే వెయ్యి వదినా..." అన్నాడు. Rs 12.00

"మజ్జిగలేదు. మీ అన్నయ్యకే లేకపోతే నీకెక్కడనుండి వస్తుంది?" అంది మూతివిరుచుకుంటూ. ఆమె మనసులోని మంటలు మరింత ప్రజ్వరిల్లాయి. "ఎప్పుడూ వుండదు మనింట్లో" అన్నాడు హరి విసుగ్గా.

సరోజిని ముఖం ఒక్కసారి భర్తవేపుతిప్పి తీక్షణంగా చూసింది. జోగారావు యేం ప్రళయం ముంచుకొస్తుందోనని భయపడ్డాడు.

"హరీ! నీకింకా పరిస్థితులు తెలీవు. ఇప్పటికే మన కాఫీలకవుతున్న పాలు, చంటిపిల్లకోసం పాలు కొనలేక తిప్పలు పడుతూవుంటే మజ్జిగ యింకెలా వస్తుంది? నన్ను చూస్తున్నావుగా— నేనింతగా ఆర్జిస్తున్నా అంతవరకు సాగలేకపోతున్నా. పోనీ మీరైనా వచ్చిన జీతమంతా యిస్తు

న్నారా అంటే అదీ లేదు— నేను మాత్రం యెక్కడనుండి తెస్తాను...?" అన్నాడు జోగారావు నెమ్మదిగా బోధపరిచే పంథాలో. హరి నోరు పెగలలేదు మరి.

"మీరు మరింత వాళ్ళను లాలించుకు తిప్పాలేం ఈసరి" అంటూ చరచరా పోయింది వంటగదిలోకి సరోజిని.

సరోజిని అందరు యిల్లాళ్ళవలె కాకుండా శాంతమూర్తి అవటంవల్ల యింతవరకైనా తాము యింట్లో నిలవగలిగామన్న విశ్వాసం లేకపోయిందా యిరువు రన్నదమ్ములకు.

హరిలో మార్పు లేకపోయినా, వేణుమనసు చివుక్కుమంది. అనవసరంగా అన్నయ్యమనసు బాధపెట్టామే— అన్నభావం వుంది గాని, ఒకవేపు తమ్ముడివాదనకూడా బాగానే వుందనుకున్నాడు. ప్రతివిషయంలోను వదిన అలా మాటివిరుచుకుంటూండటం గమనిస్తూనే వున్నాడు. అయినప్పటికీ తమ్ముడినిమాత్రం ప్రోత్సహించలేదు.

2

"చూశారండీ! మీ చిన్నతమ్ముడి ప్రేలాపన?" అంది సరోజిని వక్కపొడి అందిస్తూ. అప్పటికే వేణు, హరి భోజనం ముగించి వెళ్ళిపోయారు. జోగారావుకూడా విశ్రాంతితీసుకుని వెళ్ళేందుకు సిద్ధంగా వున్నాడు. భార్య అన్నమాటలు చెవిని పడ్డాయిగాని వినిపించనట్టే వూరుకున్నాడు.

"మీ కేనండీ చెప్తూంది— మీరున్నారుగాబట్టి యివ్వాళ గుప్ చుప్‌గా తినిపోయారు అధిక ప్రసంగం లేకుండా. అదీ వాళ్ళు ఆలస్యంగా రాబట్టి. లేకపోతే ప్రతిదినం యిదో యమ

లోకం... మీరు రాకమునుపేవచ్చి తెగవాగుతూ, పాడుతూ భోజనంచేస్తారు. అబ్బ! వెధవవాగుడు. వినలేంమరి—తెలి కడుగుతాను. యిలా యెంతకాలంచెప్పండి? యెప్పుడూ మీ తమ్ముళ్ళకు తినిపించుతూకూర్చుంటే పిల్లసంగతేమౌతుందో చూశారా? దానికోసం కాస్తయినా సిద్ధం చెయ్యకపోతే అప్పుడీ తమ్ముళ్ళు మీకు సహాయం చేస్తారనుకుంటున్నారా?

“ఎందుకుచెయ్యరు సరూ? సహాయంచేస్తారు. వాళ్ళ అదృష్టం బావుండి కాస్త మంచిపుద్యోగం దొరికిందంటే అప్పుడు మనకు వాళ్ళు తోడుపడరూ?”

“మీరలాగే అనుకుంటున్నారు గామోసు—ఇది కలికాలమండీ; కలికాలం—ఎవరికివారే యమునా తీరే... ఒకరికొక రెవరూ కారు. చూస్తాంగా; మీ అన్నయ్య యేం తెలివితక్కువవా రనుకుంటున్నారా? నాలుగు పైసాలు వెనకవేసుకుందుకు యీ యెత్తుయెత్తారు. మీ కామాత్రం చాకచక్యం లేకపోయింది.”

“పోనీ లేవే; డబ్బుతో ఏముంది? డబ్బును మనం గడిస్తున్నాంగాని అది మనల్ని గడించటంలేదుగా.”

“ఆ, యిలాంటి కబుర్లుచెప్పమంటే తొణుకూ బెణుకూ లేకుండా చెప్తారు.”

“మనంమాత్రం యిక గడించలేకపోతామా? ఇదిగో—యీ పదిహేను రోజులలో వీళ్ళిద్దరికి కార్ఖానాలో పుద్యోగం దొరుకుతుంది. దాని కన్నిప్రయత్నాలూ పూర్తయ్యాయి. భగవంతుని కృపవల్ల అది సఫలమయిందా, మనపంట పండిందనుకో. యిన్నాళ్ళూ వాళ్ళకోసం పడ్డకష్టాలొక్కసారిగా తీరిపోతాయి.”

"ఓహో! అదా మీ అభిప్రాయం! ఎంతో అనుభవజ్ఞుల్లా ముందు ప్లాను వేశారు—ఇంతా వుద్యోగం దొరికిన తరువాత మీకు పంగనామాలు పెడితేనో!"

"అలా యెప్పటికీజరగదు సుమా. ఆమాత్రం వాళ్ళకు విశ్వాసం వుండకపోదు. ఎప్పుడో గతించిన మా నాన్నను జ్ఞాపకంచేసుకుంటూ మా అమ్మ మూడు సంవత్సరాలకిత్రం పరలోకప్రాప్తి అయిందని నీకు తెలుసుదూ: అప్పట్నుంచీ వీళ్ళు నా దగ్గరే వుంటున్నారు నువ్వు వచ్చి యేణ్ణర్థం అవుతుంది గాని అంతకుముందు వీళ్లు నాకు భోజనం వండే వాళ్ళంటే నమ్మ. అలాంటివాళ్లు నన్ను మర్చిపోతారంటావా?"

"లేదు—మర్చిపోరు. మేలుమరవకుండా మెడలో పూలహారంవేసి వూరేగిస్తారు. విశ్వాసపాత్రులన్న బిరుదు పొందుతారులెండి. అయినా నా కెందుకీ అనవసరపు రభస... మీలో మీరేలాఉంటేనేం?" అంటూ భోజనంచేసేందుకు వంట గదిలోకిపోయింది. జోగారావుకేం తోచక ఆడక త్తెరమధ్య పోకచెక్కలా యిరుక్కుపోయి తికమక పడుతూ మళ్ళీ ఆఫీసుకు బయలుదేరాడు.

3

"నువ్వు చాల తొందరపడ్డావురా హరీ!" అన్నాడు వేణు షాపునుండి తిరిగి యింటికి వస్తూ.

"ఏ విషయంలో...?" అర్థం కానట్టుగా ప్రశ్నించాడు హరి.

"ఇంకేం విషయం... ఇవ్వాళ మధ్యాహ్నం వదినతో మజ్జిగ విషయంలో వాదన

"అయితే, నాదే తప్పంటావ్?" కోపంగా చూశాడు హరి.

"తప్పు నీది కాదనుకో, ఎందుకలా అనటం చెప్పు? అన్నయ్య మనవాడయినా వదిన పరాయిదిగా, అందుకే మనం ఆలోచించుకుని మాట్లాడాలి."

"నీకేమోగాని, నాకా యింట్లో వుండటం యేం నచ్చ లేదు."

"నాకుమాత్రం యిష్టమనుకున్నావా హరీ! కాని ఎక్కడికి పోతాం చెప్పు? పెద్దన్నయ్యాంటే, అసలాయింట్లోనే అడుగుపెట్టలేమామె. తప్పితే సత్రం మాత్రం కన్పిస్తుంది. సత్రంలోవుంటే మనకొచ్చిన జీతమంతా భోజనానికే ధారపో యాలి. ఈమధ్యనే మనకోసం కార్ఖానాలో వుద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాడట అన్నయ్య. అది ఫలించిందా అప్పుడు మన త్రోవ మనం చూసుకుందాం" అన్నాడు వేణు.

"అయితే వుద్యోగంఅయింతరువాత మనం అక్కడి నుండి పోదామంటావా?"

"మరే మనుకుంటున్నావు! ఎంతకాలమసి వదిన అదు పాజల్లో వుంటాం?"

ఈ సంభాషణలో యిల్లుసమీపానికి వచ్చారు.

రోజులు గడుస్తున్నయ్. జోగారావు అన్నదమ్ముల వుద్యోగం విషయంలో భగీరథప్రయత్నాలుచేసి కొంత ధన వ్యయంతో చివరికి సఫలీకృతుడయ్యాడు. అనుకున్నట్లుగా

పదిహేనురోజులకే హరి వేణులు కర్మాగారంలో వుద్యోగస్తులయ్యారు. జోగారావు అమితానందం పొందాడు. ఇక తన భవిష్యత్తు కొంత బావుంటుందనుకున్నాడు.

వేణు, హరి, యిరువురు తప్పు అభిప్రాయాన్ని మనసులో వుంచుకుని స్వార్థపరత్వంతో సంతసించారు. సరోజిని మాత్రం సంతసించలేకపోయింది. తమ్ముల వుద్యోగంకోసం కొంత డబ్బు అప్పుచేసినందుకు భర్తను నాలుగు చీవాట్లుపెట్టింది.

"మీకేం పోయింది! తమ్ముళ్ళకోసమని అప్పుచేశారు. అదెలా తీరుస్తారు?" అంది సరోజిని ముఖం చిట్లించుకుని.

"ఎందుకు తీర్చలేం సరూ! వాళ్ళు యీ నెలనుండి నూరుకుపైగా యిద్దరూ తెస్తారు. అందులో డబ్బే కొంత వెనకేసి ఒక్కసారిగా తీర్చేయవచ్చు."

"మీరింకా గాలిలో మేడలు కడుతున్నారు. అవి వొక్కసారిగా కూలిపోతాయని తెలీదు—అలా ఆ విషయమే ఆలోచించుకొని కూర్చోండి. తెచ్చిన జీతమంతా చేతిలో పెడతారు" అంది వ్యంగ్యంగా.

భార్య మాటలు యెప్పుడూ యిదే ధోరణిలో వుండటం జోగారావుకు కొత్తకాదు. అందుకే తానున్న దేదో కాకమానదని వూరుకున్నాడు.

4

రోజుకురోజు హరి, వేణుల చర్యలు విచిత్రంగా కన్పిస్తున్నయ్. అప్పుడప్పుడు వాళ్ళ నవ్వులు, కేరింతలూ, ఎగతాళి చేస్తున్నట్టుగా అనిపించేవి సరోజినికి. అయినా పల్లెత్తు

మాటనేదికాదు భర్తకు భయపడి; అథవా యేం చెప్పినా జోగారావు భార్యమాటలు పెడచెవిని బెట్టేవాడు జోగారావు అనుకుంటూ ఉండేవాడు, తన తమ్ముల సహాయంవల్ల భవిష్యత్తులో తను కొంత సాధించగలనని—

జోగారావుఅన్నయ్య మూర్తి, తమ్ముల ఉద్యోగం సంగతి విన్నాడు. ఇప్పు డతనికి వారిపై అభిమానం ముంచుకొచ్చింది. వారిపై అభిమానమనుకుంటారేమో! కాదు—వారు తెచ్చే డబ్బుపై గల అభిమానం.

ఓరోజు మూర్తి యింటికి పోతూవుంటే తోవలో వేణు, హరి కలిశారు. ఓ చిన్ననవ్వు నవ్వుకుంటూ యిద్దర్నీ దగ్గరికి పిల్చాడు.

"వేణూ! ఎప్పుడూ జోగారావన్నయ్యదగ్గరే వుంటే యెలారా? నేను మాత్రం మీ తోబుట్టువును కాదూ! నాకూ అభిమానాలు, ప్రేమలూ ఉన్నాయి. ఇంట్లో యెవ్వరూ లేక పోవటం దిగులుగా వుంటోంది. మీ వదినకూడా మిమ్మల్ని రమ్మంది. యిద్దరూ వచ్చేయకూడదూ!" అన్నాడు యెంతో అభిమానమున్నవాడిలా మూర్తి.

వేణు ఆశ్చర్యపోయాడు. హరివంక చూచాడు. హరి తనయిష్టతను చిరునవ్వుతో కనబర్చాడు చూపుల్లోనే సంజ్ఞలు చేసుకున్నా రిద్దరన్నదమ్ములు.

"సరే నన్నయ్యా! వీలు చూచుకుని వచ్చేస్తాం" అన్నాడు హరి.

"అలా కాదురా! మీ రలా సమిష్టిభావంతో రావటం అసంభవం. జోగారావు మిమ్మల్ని విడిచిపెట్టడు. మీరు

తెచ్చే డబ్బంతా దోచుకోవాలని వాంఛిస్తున్నాడు. అందుకే య్యేదైనా విరోధం తెచ్చుకుని యిల్లు దాటడం మంచిది'' అని హితోపదేశం చేశాడు మూర్తి, శ్రేయోభిలాషిలా.

''నేనూ అదే అనుకుంటున్నా అన్నయ్యా - యేంరా హారీ! నీతో మొదటే చెప్పలేదూ?—అలాగే ప్రయత్నిస్తా నన్నయ్యా...'' అంటూ వేణు ముందు దోవతీశాడు. హారి అతన్ని వెంబడించాడు. మూర్తి తనపాచికపారినందుకు సంతోషిస్తూ ముందడుగువేశాడు.

రెండురోజులు గడిచినయ్. కాని యెవరితోనూ, యేవిధమైన విరోధం తెచ్చుకోటానికి అవకాశం లేకపోయింది—ఎలా వుంటుంది? వదినె అసలు మాట్లాడేదికాదు జోగారావును యెదిరించి, కోరి కయ్యం యెలా తెచ్చుకుంటారు? అందుకే...

ఓరోజు సాయంకాలం జోగారావు యింట్లో వున్నప్పుడు యిద్దరన్నదమ్ములు బట్టలపెట్టెలు సర్దుకోవటం మొదలుపెట్టారు. జోగారావు యిదంతాచూచి అకస్మాత్తుగా ఎక్కడికి ప్రయాణం కడుతున్నారో అర్థంకాక విస్తుపోయాడు.

''ఏరా వేణూ! ఎక్కడికీ ప్రయాణం!'' వుండలేక అనేశాడు జోగారావు. సరోజిని ద్వారందగ్గర నిల్చుని చూస్తోందంతా.

వెంటనే జవాబు చెప్పేందుకు ధైర్యంచాలక వేణు కొంతసేపటివరకు తికమకపడ్డాడు. హారి జంకూ గొంకూ లేకుండా-

''మాకీయింట్లో కాస్తయినా మర్యాద లే దన్నయ్యా! వదిన మమ్మల్ని నీచాతినీచంగా చూస్తోంది. ఎంత మేం చిన్న

వాళ్ళేమయినా అభిమానమంటూ వుందిగా! ఇక మాదారి మేం చూసుకుంటాం" అనేశాడు.

జోగారావు స్తబ్ధుడైపోయాడు. నివ్వెరపోయి, నోట మాటరాలేదుకూడా. సరోజిని కోపంగా పెదవి కర్చుకుంటూ అలానే నిల్చుంది.

"ఏంరా వేణూ! నువ్వు జవాబు చెప్పవేం? నీ అభిప్రాయంకూడా అదేనా?" అన్నాడు జోగారావు మళ్ళీ.

"ఔనన్నయ్యా..." మెల్లిగా అన్నాడు వేణు, మనసులోపల సంఘానికి భయపడుతున్నట్టుగా.

ఇప్పుడు జోగారావు తనభార్య చెప్పినమాటలు అక్షరాలా నిజమౌతూండటం గమనించి తన తెలివితక్కువతనానికి తనను తిట్టుకున్నాడు.

"...మూడు సంవత్సరాలు మిమ్మల్ని నాదగ్గరుంచి పెంచాను. నేనెన్ని కష్టాలు పడినా, మీకుమాత్రం కష్టం కలిగించలేదు. చివరికి కొంతడబ్బు అప్పుచేసి యిద్దరికీ వుద్యోగాలు వేయించా—చివరికి యిదా ప్రతిఫలం...?" అన్నాడు జోగారావు ప్రాధేయపడుతున్నట్టుగా.

"మా రెక్కలాడనంతవరకూ, కూటికోసం యెన్ని బాధలైనా అనుభవించాం అన్నయ్యా! మీరు నిజంగా మాకేం కష్టంకలిగించలేదు. అదెప్పటికీ మర్చిపోం—కాని వదినదగ్గరమాత్రం ఒక్కఘడియయు ఉండలేం. ఇప్పుడు మా కాళ్ళపై మేం నిల్చున్నాం. మాదారి మేం చూచుకుంటాం భవిష్యత్తుకోసం" అన్నాడు వేణు. జోగారావు పూర్తిగా అర్థం చేసు

కౌగలిగాడు. ఇంక శాంతం వహించలేకపోయాడు. అతని రక్తం కడువేగంగా ప్రవహిస్తోంది.

"వెళ్ళటానికి వీలులేదు వేణూ! నే నప్పుచేసి మీ ఉద్యోగాలకోసం, రెండువందల రూపాయలు లంచంపెట్టాను. అవి యిక్కడ పడేయనంతవరకు వెళ్ళనివ్వను" అన్నాడు కోపంగా జోగారావు.

ఈ వాదనలు వినిపించిన యిరుగు పొరుగువాళ్ళు ఇంటి ముందు మూగారు.

"రెండువందలు లంచమిస్తారని తెలుస్తే మొదటే మాకీ ఉద్యోగాలు వద్దని చెప్పి ఉండేవాళ్ళం. మీ భాధ్యత మీరు తీర్చుకున్నారు. దానికి మేం యేం చేస్తాం? " అన్నాడు వేణు. అతడికి తెలుసు, యిక తమ ఉద్యోగాలు స్థిరంగా ఉంటాయని.

"నిజమే! వాళ్ళేంచేస్తారు? మీ తెలివితక్కువతనానికి ఫలితం మీరే అనుభవించండి" అంది కోపంగా సరోజిని. వేణు, హరి ఒకేసారి ఆమెవేపు చూచారు. మరేం అనకుండా చెరొక పెట్టె చేతిలో పట్టుకున్నారు.

"వెళ్ళొస్తాం అన్నయ్యా! వెళ్ళొస్తాం వదినా" అంటూ యిరువురు మూగిన జనాన్ని చీల్చుకుని దాటిపోయారు. అక్కడున్న జనం తలోమాటా అన్నారు.

"విశ్వాసఘాతుకులు......" అంటూ రెండుచేతులతో తలపట్టుకుని కూర్చుండిపోయాడు జోగారావు.